సాక్షి హైదరాబాద్

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



జానపద కళల పరిరక్షణకు కృషి

అంతరించిపోతున్న జానపద కళా రూపాలకు పునరుత్తేజాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. -10లో



అందంగా.. ఆకర్షణీయంగా..

బట్టతల సమస్యను అధిగమించడానికి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నారు కొందరు. ప్రధానంగా విగ్గు అందరికీ అందుబాటులో కనిపిస్తోంది. - సిటీ ప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.0/23.0

నగరంలో ఆదివారం తేలికపాటి నుంచి భారీ, అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశాలున్నాయి.


సచివాలయం వద్ద..


ఖైరతాబాద్‌లో..


అమీర్‌పేట్‌లో..

విసురుకున్న ముసురు!

నింగికి చిల్లు పడిందా అన్నట్టు నగరాన్ని ముసురు వర్షం ముసురుకుంది. తెరిపిలేని చినుకులతో సిటీ తడిసిముద్దయింది. శనివారం తెల్లవారుజాము నుంచే చిరుజల్లులు మొదలయ్యాయి. రోజంతా ముసురు పడటంతో రహదారులు, బస్తీలు, కాలనీలు చిత్తడిగా మారాయి. వాహనదారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు.


ఎస్సార్ నగర్‌లో..


ప్లాస్టిక్ కవరే గొడుగులా..

- వివరాలు 12లో

గణేశ్ ఉత్సవాలు ఘనంగా జరుపుదాం: మేయర్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వినాయక ఉత్సవాలు, నిమజ్జనం ఘనంగా జరిగేలా అని ఏర్పాట్లు చేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి చెప్పారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సూచించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవ ఏర్పాట్లపై జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం పోలీసుశాఖ, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మేయర్ మాట్లాడారు. అన్ని జోన్లలో నిమజ్జనాలకు చెరువులు, బేబీపాండ్స్ వద్ద తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. చెరువుల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులు పూర్తయ్యాయన్నారు. ఈ నెల 5లోగా చెట్ల కొమ్మల తొలగింపు, లైటింగ్ ఏర్పాట్లు, తాత్కాలిక టాయిలెట్స్, మొబైల్ టాయిలెట్స్, క్రేన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్ల వెంబడి బారికేడ్లు, గుంతల పూడ్చివేత, శానిటేషన్, ఆరోగ్య శిబిరాలు, బోట్స్, స్విమ్మర్లు, అగ్నిమాపక యంత్రాలు, తాగునీటి సరఫరా ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత మాట్లాడుతూ.. నగరంలో ఈసారి ముంబై తరహాలో ఉత్సవాలను నిర్వహించుకుందామన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు మొదలు నిమజ్జనం పూర్తయ్యే వరకు శానిటేషన్ నిర్వహణ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని నగర సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి కోరారు.

హైడ్రా పరిధిలోకి జంట జలాశయాలు

ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు ఇక మహర్దశ

జలమండలి నుంచి హైడ్రాకు పరిరక్షణ బాధ్యత

- అక్రమ కట్టడాలకు నోటీసులు, తొలగింపు అధికారాలు
- అమల్లోకి వస్తే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లకు మహర్దశ


ఉస్మాన్ సాగర్ జలాశయం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి పరిధిలోని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పరిరక్షణ బాధ్యత హైడ్రా పరిధిలోకి తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో జంట జలాశయాలపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధిలో కూల్చివేతలపై రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్ తదితర శాఖలు నోటీసులు ఇవ్వడంతో గందరగోళం తలెత్తింది. దీంతో పాటు ఇటీవల హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ హైడ్రాకు మరిన్ని అధికారాలు, సిబ్బందిని అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జంట జలాశయాల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపునకు పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగించే కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే హైడ్రా గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ కట్టడాలను కూల్చివేసింది. తాజాగా హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాల కూల్చివేతకు సిద్ధమైంది.

కుంచించుకుపోతున్న జలాశయాలు..

దాదాపు వందేళ్లుగా మహా నగర దాహార్తిని తీరుస్తూ.. ఇటు వరదల నుంచి రక్షణ కల్పిస్తూ.. ఆపద్బాంధవులుగా ఉన్న జంట జలాశయాలు ఆక్రమణల పర్వంతో విలవిల్లాడుతున్నాయి. కబ్జాలు, అక్రమ నిర్మాణాలతో రిజర్వాయర్లలోకి నీళ్ల వచ్చే మార్గాలు మూసుకుపోయి కుంచించుపోతున్నాయి. 111 జీఓ నిబంధనలను తోసిరాజంటూ పరీవాహక ప్రాంతంలో భారీగా నిర్మాణాలు వెలిశాయి. ప్రధానంగా 2002 నుంచి ఆక్రమణలు, అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయి. కొత్త నిర్మాణాలపై నిషేధమున్నా.. వందల కొద్దీ రియల్ ఎస్టేట్ వెంచర్లు, వేలకొద్దీ విల్లాలు, నివాస సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలేజీలు, వాణిజ్య భవనాలు పుట్టుకొచ్చాయి. ఫలితంగా జంట జలాశయాలకు వరద నీటిని చేర్చే కాల్వలు (ఇన్‌ఫ్లో చానల్స్) కబ్జాకు గురవడం, ఆ ప్రాంతాలు ఫాంహౌస్లు, ఇంజినీరింగ్ కళాశాలలు, గోడౌన్లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలతో పాటు ఇటుక బట్టీలు, ఇసుక మాఫియాకు అడ్డాలుగా మారడంతో జలాశయాలు చిన్నబోతున్నాయి.

వేల సంఖ్యలో కబ్జాలు..

జంట జలాశయాల పరిరక్షణ అంశంలో జలమండలి, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేక పరిస్థితి చేయి దాటింది. జలాశయాల పరిరక్షణకు ఉద్దేశించిన 111 జీఓకు తూట్లు పొడుస్తూ పరీవాహకం పరిధిలో ఒకటీ.. రెండూ కాదు.. వేల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. మూడేళ్ల క్రితం రెవెన్యూ శాఖ జీఓ వర్తించే ఆరు మండలాల పరిధిలోని 84 గ్రామాల్లో సర్వే నిర్వహించింది. మొత్తంగా 426 లేఅవుట్లలో 10,907 ఇళ్లు.. గ్రామాల్లో 4,567 ఇళ్లు, 1,920 వాణిజ్య భవనాలు అక్రమంగా నిర్మితమై ఉన్నట్టు బహిర్గతమైంది. ఇందులో కాలేజీలు, ఫంక్షన్ హాళ్లు, ఫామ్ హౌస్‌లు, గోదాములను రెవెన్యూ అధికారులు గుర్తించి అప్పట్లో హడావుడి చేశారు. శంషాబాద్ పరిధిలో కొన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆ తర్వాత రాజకీయ పెద్దల జోక్యంతో వెనకకు తగ్గారు. జంట జలాశయాల పరిరక్షణ కోసం నిపుణులతో లేక్ ప్రొటెక్షన్ అథారిటీ ఏర్పాటు చేయాలని గతంలోనే హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది కానీ కార్యరూపం దాల్చలేదు. శిఖం భూముల్లో అక్రమంగా వెలసిన ఫాంహౌస్ కాలేజీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లను తొలగించడంలో తాత్సారం చేసింది.

అమలుకు నోచుకోని జీఓ..

జంట జలాశయాల పరిరక్షణ కోసం ఉమ్మడి రాష్ట్రంలోనే 111 జీఓ అమల్లోకి వచ్చింది. ఈ జలాశయాలకు చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో భారీ శాశ్వత నిర్మాణాలపై నిషేధం విధించింది. కాలుష్య కారక పరిశ్రమలు, నివాస కాలనీలు, భారీ హోటళ్లు, రెస్టారెంట్లు, కాలేజీలు, ఇతర సంస్థలు వంటివేవీ ఉండకూడదనే నిబంధన పెట్టింది. ఈ ప్రాంతం పరిధిలో వేసే లేఅవుట్లలో 60 శాతం ఓపెన్‌గా రోడ్ల కోసం వదలాలి. వినియోగించే భూమిలో 90 శాతం మొక్కల పెంపకానికి కేటాయించాలి. భవనాలేవీ గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్తులకు మించి నిర్మించడానికి వీల్లేదు. కానీ ఎక్కడా ఈ ఆంక్షలు అమలు కాలేదు.

చెరువుల్లో సైతం..

హిమాయత్‌సాగర్ పరిధిలో శిఖం భూములు పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయి. ప్రధానంగా అజీజ్ నగర్, నాగిరెడ్డిగూడ, హిమాయత్‌సాగర్, కొత్వాల్‌గూడ, కుర్మగూడ, నర్కుడ గ్రామాల పరిధిలో సుమారు 50 ఎకరాలు పరాధీనమైనట్టు రెవెన్యూ శాఖ లెక్క తేల్చింది. వాస్తవంగా దాని కంటే మూడు నాలుగింతలు అధికంగా ఉంటుందన్న అంచనా. ఇక ఉస్మాన్ సాగర్ పరిధిలోని ఖానాపూర్, గున్‌గుర్తి, గండిపేట్, శంకర్‌పల్లి, జన్వాడ పరిధిలో సుమారు 300 ఎకరాల భూములు ఆక్రమణలకు గురైనట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. తాజాగా హైడ్రా పరిధిలోకి రానుండటంతో జంట జలాశయాలకు మహర్దశ పట్టే అవకాశం లేకపోలేదని నిపుణులు పేర్కొంటున్నారు.

టెన్షన్.. టెన్షన్

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భవన యజమానుల్లో ఆందోళన

- హైడ్రా దూకుడుతో అక్రమ నిర్మాణదారుల్లో వణుకు
- వత్తాసు పలికిన అక్రమార్కులపై చర్యలకూ సిద్ధం



395 మంది బహుళ అంతస్తులకు తాఖీదులు

సాక్షి, సిటీబ్యూరో:

గ్రేటర్ సహా శివారుల్లోని చెరువులకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భవన యజమానుల్లో టెన్షన్ నెలకొంది. ఎప్పుడెలాంటి నోటీసులు అందుకోవాల్సి వస్తుందోనని ఆందోళనకు గురవుతున్నారు. హైడ్రా చర్యలతో బెంబేలెత్తిపోతున్నారు. ఏళ్లుగా నివాసం ఉంటున్న చాలా మంది తమ ఇళ్లు, భవనాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయంటూ నోటీసులు అందడంపై ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిన్నగాక మొన్న నగరంలోని దుర్గం చెరువు ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ ,బఫర్ జోన్ పరిధిలో మీ నివాసాలు ఉన్నాయంటూ.. 204 మంది భవన దారులకు నోటీసులను హైడ్రా జారీ చేసింది. ఘట్‌కేసర్ మండలంలోని వెంకటాపురం నాదెం చెరువు బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారంటూ.. 25 మందికి నోటీసులు జారీ కావటంతో టెన్షన్‌కు గురవుతున్నారు.

- కుత్బుల్లాపూర్ మండలంలోని ఉమామహేశ్వర్‌కాలనీ ఫాక్స్ సాగర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారంటూ 86 మంది ఇంటి యజమానులకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. దుండిగల్ మండల పరిధిలోని ఎంఎల్‌ఆర్‌ఐటీ, ఐఏఆర్‌ఈ కళాశాలలకు నోటీసులు జారీ అయ్యాయి.
- మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా భవనాలు నిర్మించారని 80 మందికి స్థానిక రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇవే కాదు గ్రేటర్ హైదరాబాద్‌తోసహా శివారు ప్రాంతాల్లోని చెరువు ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ పరిధిలో నివాసముంటున్న ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేస్తుండటంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అప్ప చెరువులో ఆక్రమణలు నేలమట్టం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గగన్ పహాడ్ అప్పచెరువు బఫర్ జోన్‌లో అక్రమంగా వెలసిన షెడ్లు, ఫ్యాక్టరీల కట్టడాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. శనివారం ఉదయం నుంచే అధికారులు కూల్చివేతలు మొదలు పెట్టారు. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన షెడ్లను తొలుత పరిశీలించిన అనంతరం కూల్చివేశారు.

ఆ అధికారుల్లోనూ వణుకు..

హైడ్రా దూకుడుతో చెరువు ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికిన అధికార యంత్రాంగానికి వణుకు పుడుతోంది. చెరువు శిఖం పరిధిలో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు న మోదు చేయాలని పోలీస్ యంత్రాంగానికి హైడ్రా సిఫారసు చేయడం వారిలో ఆందోళనకు కారణమవుతోంది.

అక్రమార్కులపై...

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నిజాంపేట మున్సిపల్ కమిషనర్, సర్వేయర్ సహా బాచుపల్లి తహసీల్దార్లపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించటంపై తీవ్ర చర్చ సాగుతోంది. అక్రమార్కులకు కొమ్ముకాసిన అధికారులపై వేటుకు రంగం సిద్ధమవ్వడంతో మిగతావారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 489 చెరువుల్లో 30కిపైగా ఆక్రమణకు గురైనట్లు ఇటీవల కలెక్టర్‌కు సమర్పించిన నివేదికలో జిల్లా నీటిపారుదల శాఖ పేర్కొంది.

ఈదులకుంటలో ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తాం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్


ఈదుల కుంట చెరువును పరిశీలిస్తున్న రంగనాథ్ తదితరులు

మాదాపూర్: ఈదులకుంట చెరువులో ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. శేరిలింగంపల్లిలోని ఈదుల కుంట చెరువు ఆక్రమణకు గురైన సమాచారం తెలిసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్థానిక రెవెన్యూ, హైడ్రా అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. రెవెన్యూ అధికారుల వద్ద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖానామెట్ సర్వే నంబర్ 7లో 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈదులకుంట చెరువును ఓ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ (విష్ణు బిల్డర్స్)కు చెందిన అధినేత చెరువును జేసీబీలతో పూడుస్తున్న విషయం గతంలో పత్రికల్లో వచ్చిన కథనాలు, సీపీఎం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెరువును పరిశీలించారు. కబ్జాకు పాల్పడిన వారిని ఎంతటివారైన ఉపేక్షించేది లేదని తెలిపారు. చెరువుల పునరుద్ధరణకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈదుల కుంట చెరువు ఆక్రమణను పూర్తిగా తొలగించి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈదులకుంట చెరువు ఆక్రమణకు గురైన వివరాలను సీపీఎం నేత శోభన్ వివరించారు. రెవెన్యూ ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ జగదీశ్‌లను పూర్తి వివరాలను అందించాలని రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సున్నం చెరువును పరిశీలించి బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా వెలసిన భవనాలను, కబ్జాకు గురైన సున్నం చెరువును పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సరికొత్త 'మత్తు'

నిద్రమాత్రలు పొడిగా చేసుకుని ఇంజెక్ట్ చేసుకుంటున్న యువత.. ఐదుగురి రిమాండ్

బంజారాహిల్స్: డ్రగ్స్, గంజాయికి బానిసలైన ఐదుగురు మిజోరాం రాష్ట్ర యువతీ యువకులు నిద్ర మాత్రలను పొడిగా చేసుకుని ఇంజెక్ట్ చేసుకుని మత్తులో జోగుతూ బంజారాహిల్స్ పోలీసులకు చిక్కారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మిజోరాంకు చెందిన ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులు బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీరాంనగర్ బస్తీలో నివాసం ఉంటూ సెలూన్లు, స్పా సెంటర్లలో బ్యూటీషియన్లు, థెరపిస్టులుగా పని చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయికి బానిసలైన వీరు నగరానికి వచ్చిన తర్వాత అవి లేకుండా ఉండలేకపోయారు. దీంతో నిద్ర మాత్రలైన నైట్రావెట్ ట్రామా జాక్, టైడోల్ తదితరాలను కుషాయిగూడలోని ఓ మెడికల్ షాప్ నుంచి కొనుగోలు చేసుకుని వచ్చి పొడి చేసి నీళ్లల్లో కలిపి ఇంజెక్ట్ చేసుకుంటున్నారు. దీనిపై సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు వారి గదిపై దాడి చేయగా ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులు స్పృహ లేకుండా మత్తులో కనిపించడంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అబ్రహం, లాల్ రుక్మి, రిక్కీ, లాల్ రెడ్కి, కేథరిన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సంజీవ, లాల్ నున్పియా, డేవిడ్ తదితరులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పబ్‌లపై ఎక్సైజ్ దాడులు

ఆరుగురు డ్రగ్ వినియోగించినట్టు నిర్ధారణ



సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టీజీ నాబ్ సంయుక్తంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో పబ్‌లపై దాడులు నిర్వహించాయి. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ దాడుల్లో నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లోని పబ్బులపై ఏకకాలంలో 25 ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. అనుమానితులను డ్రగ్స్ డిటెక్షన్ కిట్స్ తో పరీక్షలు నిర్వహించగా ఆరుగురు డ్రగ్స్ సేవించినట్టుగా నిర్ధారణ అయింది. జోరా పబ్, క్లబ్ రోగ్ పబ్, విస్కీ సాంబ అనే పబ్బుల్లో బండ్లగూడ జాగీర్‌కు చెందిన అభిషేక్ శ్రీవాత్సవ డీజే, మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన అబ్దుల్ ఘని, శశావత్ మహా పాత్ర,హరిత భాను, మీర్ అబిద్ అలీలకు పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు.

అన్ని శాఖల సమన్వయంతోనే నగరాభివృద్ధి: ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఇమేజ్ మరింత పెంచడానికి పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా నగరాభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతోనే అది సాధ్యమని పేర్కొన్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సిటీ కన్వర్జెన్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో జరుగుతున్న ఈ సమావేశంలో తీసుకున్న అజెండా అంశాల సత్వర పరిష్కారానికి అన్నివిభాగాలు కృషి చేయాలని కోరారు. ఆర్ అండ్ బి, మెట్రో రైల్వే, విద్యుత్, జాతీయ రహదారులు, ట్రాఫిక్, వాటర్ వర్క్స్, హెచ్‌ఎండీఏ, పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ తదితర విభాగాల ఉన్నతాధికారులతో ఆయా అంశాలపై ఆమె సమీక్షించారు. పలు చోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణాలు, సైన్ బోర్డుల ఏర్పాటు, కొత్త రోడ్ల నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధి, ఫ్రీ లెఫ్ట్ లేదా ర్యాంపుల ఏర్పాటు, అండర్ పాస్ నిర్మాణాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణ, బ్లాక్ స్పాట్స్ గుర్తించి పరిష్కార చర్యలు, పలు పనులకు పరిపాలన అనుమతులు, విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు, తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించారు. తొలుత హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌లు, ట్రాఫిక్ సీపీ నగరంలో రోడ్లు, జంక్షన్లు, ట్రాఫిక్ సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, చేపట్టాల్సిన చర్యల గురించి సూచించారు. సమావేశంలో ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ



చినుకు చిటపట.. మెట్రో కిటకిట

- రోజుకు సుమారు 5 లక్షల మందికిపైగా ప్రయాణం
- కిక్కిరిసిపోతున్న రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: చినుకు పడితే చాలు మెట్రో రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మెట్రో రైళ్లకు డిమాండ్ పెరిగింది. రహదారులను ముంచెత్తే వరదలు, ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నగరవాసులు మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో రైళ్లలో రద్దీ విపరీతంగా పెరిగింది. ఐటీ సంస్థల్లో పని చేసే సాఫ్ట్‌వేర్ నిపుణులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేసే చాలా మంది ఉద్యోగులు, విద్యార్థులు సకాలంలో చేరుకొనేందుకు మెట్రోలనే ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో రోజుకు వెయ్యి ట్రిప్పులకు పైగా నడిచినా ప్రయాణికుల రద్దీ మేరకు రైళ్లు అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 4.8 లక్షల నుంచి 5 లక్షల మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. ఏటేటా ప్రయాణికుల సంఖ్య పెరుగుతూనే ఉంది. కానీ రద్దీ మేరకు అదనపు సర్వీసులు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. కోచ్‌ల సంఖ్యను పెంచేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ గత సంవత్సరమే ప్రణాళికలను రూపొందించింది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. నగరంలోని మూడు ప్రధాన కారిడార్‌లలో మెట్రో రైళ్లు ప్రతి రోజు 1034 ట్రిప్పులు తిరుగుతున్నాయి. గత ఏడాది జూలైలో అదనపు మెట్రోలకు ప్రతిపాదనలను చేశారు. నాగపూర్ నుంచి లీజు ప్రాతిపదికన కోచ్‌లను తెప్పించనున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేకుండాపోయింది.

జానపద కళల పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు


ఆకట్టుకున్న జానపద నృత్య రూపకం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో అంతరించి పోతున్న జానపద కళారూపాలకు మళ్లీ పునరుత్తేజాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సారిపల్లి కొండల్‌రావు ఫౌండేషన్, జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... కళారంగానికి పెద్ద పీట వేయడంతో పాటు కవులు, కళాకారులకు, రచయితలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో కళాకారుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, యువతలో మార్పులు తీసుకువచ్చేందుకు కవులు, కళాకారులు, రచయితలు బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యాటక రంగంలో జానపద కళాకారుల సేవలను వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను తెలియజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంగీత నాటక అకాడమి చైర్మన్ డాక్టర్ అలేఖ్య పుంజాల, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు కె.సోమాలాల్, గడ్డం సమ్మయ్య, డాక్టర్ కేవీ.రమణాచారి, వ్యాపారవేత్త సారిపల్లి కొండల్‌రావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌కు గ్రామీణ ఉత్పత్తులు

- షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతులకు రూ. 9కోట్లు కేటాయింపు
- డిసెంబర్ 9న కాంప్లెక్స్‌ల పునః ప్రారంభం
- శిల్పారామం నైట్‌బజార్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తనిఖీలు


శిల్పారామం నైట్ బజార్‌ను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తదితరులు

మాదాపూర్: మహిళా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విభిన్న ఆలోచనలతో ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె మాదాపూర్‌లోని శిల్పారామం నైట్‌బజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 64 లక్షల మంది మహిళలు సొంత కాళ్లపై నిలబడేందుకు 17 రకాల వ్యాపారాలను సెర్ప్ సంస్థ ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. వివిధ రకాల వ్యాపారాల్లో మహిళలు రాణిస్తున్నారని, శిల్పారామం నైట్ బజార్‌లో ఉన్న 106 స్టాల్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐటీ ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉండేందుకు రాత్రి 2గంటల వరకు నైట్‌బజార్ కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎనిమిదేళ్లుగా ఇంత మంచి ప్రాంగణం మూతపడిందన్నారు. నైట్‌బజార్‌ను తిరిగి సెర్ప్ ద్వారా ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళ సాధికారతతోనే పేదరిక నిర్మూలన జరుగుతుందన్నారు. అన్ని అవసరాలను తీర్చుకోగల ఆర్థిక వ్యవస్థ మహిళ చేతిలో ఉండాలని సెర్ప్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజ్, కాంగ్రెస్ మీడియా చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి, శిల్పారామం జనరల్ మేనేజర్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

డీసీపీతో దురుసుగా మాట్లాడిన కానిస్టేబుల్ సస్పెన్షన్

వెంగళరావునగర్ : డీసీపీతో దురుసుగా మాట్లాడినందుకు మధురానగర్ పీఎస్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ మధురానగర్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలీసులను రోల్‌కాల్ చేశారు. అయితే కానిస్టేబుల్ డి.తిరుపాల్‌నాయక్ ఆలస్యంగా విధులకు హాజరుకావడంతో డీసీపీ అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి వెళ్లే సమయంలో విధులు సక్రమంగా నిర్వహించాలని హెచ్చరికలు జారీ చేశారు. దీనిపై కానిస్టేబుల్ తిరుపాల్ నాయక్ స్పందిస్తూ తన భార్య ఆసుపత్రిలో ఉన్నందున తానే దగ్గరుండి సపర్యలు చేయాల్సి వస్తుందని, అందువల్ల ఆలస్యమైందని, దానికే దూషిస్తే ఎలాగంటూ దురుసుగా మాట్లాడాడు. మౌనంగా అక్కడి నుంచి వెళ్లిపోయిన డీసీపీ ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. డీసీపీపై దురుసుగా వ్యవహరించిన మాట వాస్తవమేనని ఎస్‌హెచ్‌ఓ ద్వారా తెలుసుకున్న సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి శనివారం అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

4న జిల్లా కలెక్టరేట్ల వద్ద రిలే నిరాహార దీక్ష

కాచిగూడ: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ ఈనెల 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు బత్తుల రాం ప్రసాద్, పిల్లి సుధాకర్, జంగా శ్రీనివాస్, అవుల బాలనాథం, గుడిమల్లె వినోద్ కుమార్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ పిలుపుమేరకు ఈనెల 11న చలో జంతర్ మంతర్, న్యూఢిల్లీ వద్ద నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఈనెల 19న నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాల సామాజిక వర్గానికి చెందిన ఒకరిద్దరు పేర్లను ప్రస్తావిస్తూ మంద కృష్ణమాదిగ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. 70 సంవత్సరాలుగా రిజర్వుడ్ స్థానాలను మాలలు మాత్రమే అనుభవిస్తున్నారని, మాదిగలను మోసం చేస్తున్నారని అంటున్న మంద కృష్ణమాదిగ ప్రచారం పూర్తిగా అవాస్తవమని వారు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా దళిత మేధావి వర్గం, వివిధ రాజకీయ పార్టీల్లోని దళిత ప్రజాప్రతినిధులు సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నారన్నారు.

యువత దేశాభివృద్ధికి పాటు పడాలి



నాగోలు: యువత సృజనాత్మకత ద్వారా దేశాభివృద్ధికి పాటు పడాలని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి అన్నారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రాస్మా) ఆధ్వర్యంలో శనివారం నాగోలు శుభం కన్వెన్షన్ హాల్ జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ యువత స్టార్టప్‌లలో 2016లో 450గా ఉన్న సంఖ్య నేడు 1.40 లక్షలకు చేరిందన్నారు. వికసిత భారత్ లక్ష్యంగా పనిచేస్తున్న తాము ప్రభుత్వపరంగా ముఖ్యంగా ఇస్రో కార్యక్రమాల ద్వారా పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ ట్రాస్మాకు తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. పాఠశాలల పాత్ర తెలంగాణ విద్యారంగంలో కార్పొరేటర్ వ్యవస్థను కట్టడి చేయడం ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందించేందుకు తన వంతు కృసి చేస్తానని హామీ ఇచ్చారు. లీడ్ ఇండియా ఫౌండర్ డాక్టర్ సుదర్శనాచార్య మాట్లాడుతూ.. దేశంలో 20 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని వారందరిలో విలువలతో కూడిన విద్య ద్వారా పరివర్తన తేవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ప్రదీప్, ట్రాస్మా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎస్ఎన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, టాస్మా ప్రెసిడెంట్ కె. పాపిరెడ్డి, ట్రెజరర్ కే. శ్రీకాంత్ రెడ్డి. స్పోక్ పర్సన్ రామచందర్, అడ్వైజర్ అనంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో కారు బీభత్సం..

మూడు వాహనాల ధ్వంసం..



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని లుంబినీ హాల్ ఎదుట శనివారం తెల్లవారుజామున అతి వేగంగా వచ్చిన ఓ కారు వరదనీటి ధాటికి అదుపుతప్పి పార్కింగ్ చేసి ఉన్న రెండు వాహనాలను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలగూడకు చెందిన అబ్బాస్ (19) రాంనగర్ చేపల మార్కెట్‌లో చేపల వ్యాపారం చేసేవాడు. శుక్రవారం రాత్రి బార్కస్‌లో ఓ వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరైన అతను తెల్లవారుజామున ఫార్చునర్ కారులో బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2 మీదుగా వేగంతో దూసుకుపోతున్నాడు. అప్పటికే భారీ వర్షం కురుస్తుండడంతో కారు అదుపుతప్పింది. దీంతో లుంబినీ మాల్ పక్కనే పార్కింగ్ చేసి ఉన్న ఓ ఆటోతో పాటు ఓ కారును ఢీకొట్టడంతో అవి నుజ్జునుజ్జయ్యాయి. అబ్బాస్ నడుపుతున్న కారు బోల్తాపడి పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో అబ్బాస్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతడిపై ఆస్తుల ధ్వంసం కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇఫ్లూ ఇన్‌చార్జి వీసీగా ప్రొ.హరిబండి లక్ష్మి




ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ) ఇన్‌చార్జి వీసీగా ప్రొ.హరిబండి లక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్న ప్రొ.సురభి భారతి శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో నూతన ఇన్‌చార్జి వీసీగా ప్రొ.హరిబండి లక్ష్మి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇఫ్లూలోనే విద్యాభ్యాసం పూర్తి చేసిన ప్రొ.హరిబండి లక్ష్మి ట్రాన్స్‌లేషన్ స్టడీస్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. మాజీ వీసీ ప్రొ.సురేష్‌కుమార్ పదవీ కాలం ముగిసిన తర్వాత జనవరి 2024లో ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు చేపట్టి 8 నెలలు పదవిలో కొనసాగారు. శనివారం ఇఫ్లూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొ.సురభి భారతి ప్రొ.హరిబండి లక్ష్మికి పాలన బాధ్యతలు అప్పగించారు.

అల్లం సమస్య పరిష్కారం

చాదర్‌ఘాట్: గత కొన్ని నెలలుగా జహీరాబాద్ (కోహీర్) అల్లానికి గిట్టుబాటు ధర రాక అల్లం రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు అప్రమత్తమై వారం రోజుల క్రితం కోహీర్ అల్లం రైతులతో మలక్‌పేటలో వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. కేరళ రాష్ట్రం నుంచి వచ్చే అల్లాన్ని దిగుమతి చేసుకోవద్దని స్థానిక వ్యాపారస్తులకు ఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా మార్కెట్ చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు చేసి కేరళ రాష్ట్రం అల్లం దిగుమతులను అడ్డుకున్నారు. గత 15 రోజులుగా కోహీర్ అల్లంను నగర వ్యాప్తంగా దిగుమతి చేసి గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టారు. దీంతో జహీరాబాద్ కోహీర్ అల్లం రైతులు సంతోషం వ్యక్తము చేశారు. నెలరోజుల తర్వాత కేరళ రాష్ట్రం అల్లానికి అనుమతి ఇస్తామని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

రాజకీయ కక్షతోనే కూల్చివేతలు


తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాజకీయంగా ఎదుర్కోలేకే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై ఆయన స్పందిస్తూ పట్టా భూముల్లో చేపట్టిన నిర్మాణాలను రాజకీయ కక్షతో కూల్చివేయడం దారుణమన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ తాతల కాలం నుంచి వస్తున్న భూముల్లో చేపట్టిన నిర్మాణాలను అక్రమ నిర్మాణాలుగా ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. 1980 నుంచి తమకు ఈ భూములు ఉన్నట్లు తెలిపారు. రాజకీయంగా తనను దెబ్బతీయాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఈ విషయమై న్యాయపోరాటం చేస్తానని వెల్లడించారు. సీయం రేవంత్ రెడ్డి వైఖరితో ప్రజలు విసిగిపోయారని ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. హైడ్రా పేరుతో ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ తీరును ఎండగడతానని ఆయన స్పష్టం చేశారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

నాగోలు: బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులపాలైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..సూర్యపేట జిల్లా, తిరుమలగిరి మండలం, తొండ గ్రామానికి చెందిన కసమంత్‌రెడ్డి కృష్ణారెడ్డి కుటుంబంతో కలిసి నాగోలు సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతడి చిన్నకుమారుడు సందీప్‌రెడ్డి(25) కొంతకాలంగా స్విగ్గి డెలివరీ బాయ్ పని చేస్తున్నాడు. బెట్టింగ్‌లకు అలవాటు పడిన అతను పలువురి వద్ద అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో పొలం పాస్‌బుక్ పెట్టి బ్యాంక్ లోన్ తీసుకురావాలని కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన సందీప్‌రెడ్డి పై అంతస్తులోకి వెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. శనివారం మధ్యాహ్నం వరకు అతను కిందికి రాకపోవడంతో తల్లి శోభ పైకి వెళ్లి చూడగా రేకుల షెడ్డు పైప్‌నకు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి శోభ ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

29 మంది పోలీసుల ఉద్యోగ విరమణ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం 29 మంది అధికారులు, సిబ్బంది ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని జాయింట్ కమిషనర్ (అడ్మిన్) గజరావు భూపాల్ సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రిటైర్‌మెంట్ తర్వాత పోలీసు శాఖ నుంచి రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్‌ను సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేని, ఆయా కుటుంబాలకు ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామని తెలిపారు. అదనపు డీసీపీ శ్రీనివాస రావుతో పాటు ఏడుగురు ఎస్ఐలు, 17 మంది ఏఎస్ఐలు, ఇద్దరు హెచ్‌సీలు, ఒక్క పీసీ, ఒక్క ఎల్‌జీఈ సిబ్బంది పదవీ విరమణ పొందారు. చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏడీఓ శ్రీదేవి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు యన్.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ: ప్రేమ విఫలం కావడంతో మనస్తాపానికి లోనైన ఓ విద్యార్థి హోటల్ రెస్టారూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన కోట బాలాజీ (20) బీఎంఎల్‌డీ ద్వితీయ సంవత్సరం చదువుతూ కాచిగూడ త్రివేణి లాడ్జిలో పార్ట్‌టైమ్ రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి డ్యూటీకి వచ్చిన అతను శనివారం తెల్లవారు జామున రెస్టారూమ్‌లో బెడ్‌షీట్‌తో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హోటల్ సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎంటీఎస్ రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

కాచిగూడ: ఎంఎంటీఎస్ రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ సీఐ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి (40) నడుస్తున్న రైలు నుంచి దిగేందుకు యత్నిస్తూ కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుద్వేల్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (65) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.